క్లుప్తంగా

రేపు హరితోత్సవం

దౌల్తాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే హరితోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీఓ తిరుమల స్వామి చెప్పారు. శనివారం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కూలీలందరికీ పని కల్పించడంతో పాటు మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో హరితోత్సవం రోజున మొక్కలు నాటాలని, గ్రామాల్లో హరితోత్సవంపై చాటింపు వేయించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

దౌల్తాబాద్: దేవర్‌ఫసల్‌వాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, దస్తప్పలతో పాటు సుమారు 20మంది కార్యకర్తలు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసి, రానున్న రోజుల్లో కొడంగల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఇంటికీ మేలు చేస్తున్నారని, ఆర్థికంగా ఎవరూ ఇబ్బంది పడకూడదని సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం అందజేస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తన క్యాంపుకార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, సర్పంచ్ అంజద్, చిన్న నందిగామ సాయిలు పాల్గొన్నారు.

దళారుల జోలికి వెళ్లకండి


- కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి
- పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: దళారుల జోలికి వెళ్లకుండా.. జొన్న రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2,970లకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,500లు ఉందని, రైతులకు మేలు చేసే విధంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ప్రతి రైతు పీఏసీఎస్‌లో సభ్యత్వం పొంది అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ అజీజ్, సీఈఓ శేఖర్, డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్ శివరాజ్

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని బస్వాపూర్ ఎస్‌ఎంసీ చైర్మన్ మంగలి శివరాజ్ అన్నారు. శనివారం బంట్వారం మండలం బస్వాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకొని ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎల్ల వేళలా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. క్వాలిటీ విషయంలో రాజీ పడొద్దని అక్షయ పాత్ర సిబ్బందికి చెప్పారు.

ఆర్థిక సాయం.. అయోమయం

వృత్తి దారులకు చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో 15 కులాలను చేర్చుతూ జాబితా ప్రకటించింది. కానీ పథకం గురించి అవగాహన లేని అన్ని సామాజిక వర్గాల ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఎవరు అర్హులో, అనర్హులో తెలియకుండా ధ్రువ పత్రాలతో అర్జీ పెట్టుకునేందుకు తిరుగుతూ అయోమయం చెందుతున్నారు.

- కుప్పలుగా కులవృత్తి దరఖాస్తులు
- అనర్హుల అర్జీలే అధికం
- ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించని అధికారులు



పెద్దేముల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద కుల ధ్రువీకరణ పత్రాల కోసం బారులు తీరిన వృత్తిదారులు

కుల్కచర్ల: బీసీ సామాజిక వర్గంలోని కుల వృత్తులను నమ్ముకున్న నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి, మేదరి వంటి కులాల వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కుల వృత్తులు చేస్తున్నవారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని, ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 20వ తేదీ వరకు అప్లికేషన్ పెట్టుకోవడానికి గడువూ విధించింది. అయితే పథకానికి సంబంధించి నిబంధనలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారు. దీంతో అన్ని కులాల వారు అర్జీలు పెట్టుకొని ఆర్థికంగా నష్టపోవడంతో పాటు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అనర్హుల దరఖాస్తులే అధికం

బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆ సామాజిక సంఘం వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు ఆ సంఘం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే ఈ సహాయానికి ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు, అనుసరించాల్సిన విధానంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో బీసీ సామాజిక వర్గంలోని అన్ని కులాల వారు ఈ గ్రాంటును పొందేందుకు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారు.

అర్హులెవరు?

బీసీ వెల్ఫేర్ ద్వారా ప్రభుత్వం అందజేయాలనుకున్న రూ.లక్ష గ్రాంటును పొందేందుకు కేవలం 15 కులాల వారికి మాత్రమే అవకాశం ఉంది. అందులో 1. నాయీ బ్రాహ్మణులు, 2.రజక, 3.సగర/ఉప్పరి, 4.కుమ్మరి/శాలివాహన, 5.అవుసులు, 6.కంసాలి, 7.కమ్మరి, 8.కంచరి, 9.వడ్ల/వడ్రంగి, 10.కృష్ణబలిజ/పూసల, 11.మేదర, 12.వడ్డెర, 13. ఆరె కటిక, 14. మేర, 15.ఎంబీసీలను స్కీం వర్తించే బీసీ కులాలుగా పేర్కొంది.

నిధుల కేటాయింపులో అయోమయం

రూ.లక్ష స్కీంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలు ఒక మండలానికి ఎంతమందిని ఎంపిక చేస్తారు? అందుకు అనుసరించే ప్రక్రియపై మండల అధికారులకు అవగాహన లేదు. ఏ కులానికి ఎన్ని కేటాయిస్తారు, దరఖాస్తు చేసుకున్న వారు.. వారి దరఖాస్తు పత్రాలను ఎవరికి అందించాలన్న విషయం కూడా తెలియదన్నట్లు ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి. జిల్లా స్థాయిలోనూ సరిపడా నిధులను నిరంతరం అందించడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.. తప్పిస్తే ఈ స్కీం కొరకు జిల్లాకు ఎన్ని నిధులు కేటాయించారో చెప్పలేని పరిస్థితి. దీంతో అధికారుల నుంచి సరైన సమాచారం దొరకక కులవృత్తిదారులు అయోమయానికి గురవుతున్నారు.

గడువు పెంచాలి

దౌల్తాబాద్: బీసీ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రూ.1లక్ష సాయం పొందడానికి మీసేవ ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో.. మీసేవ కేంద్రాల ధ్రువపత్రాల అర్జీకి రద్దీ పెరిగిపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో దాదాపు 500మంది వరకు ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాల జారీ కోసం నిరీక్షిస్తున్నారు. సర్టిఫికెట్లు పొందడానికి తీవ్ర జాప్యం జరుగుతుందని, రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి మరో 10 రోజులు గడువు పెంచాలని వృత్తి దారులు కోరుతున్నారు.

రాత్రి పగలు కష్టపడి..

పెద్దేముల్: మూడు రోజుల నుంచి సర్వేయర్ నెట్‌వర్క్ పనిచేయక రెవెన్యూ కార్యాలయం వద్ద కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కులవృత్తి దారులు పడుగాపులు కాయగా.. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు అర్జిదారులకు రెవెన్యూ అధికారులు పత్రాలు అందజేశారు. సుమారు 400ల వరకు ఒకే రాత్రి సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి, లబ్ధిదారులకు అందజేశామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తెలిపారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు.

అవగాహన కల్పించాలి

బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించే పథకంపై ప్రజలకు అవగాహన లేదు. దీంతో అన్ని కులాల వారు ఆసక్తి చూపుతున్నారు. అందుకు కావాల్సిన ధ్రువపత్రాల కొరకు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలి. – అంజనేయులు, ముదిరాజ్

నిధుల కేటాయింపు నిరంతర ప్రక్రియ

బీసీ వెల్ఫేర్ కింద అందజేసే కుల వృత్తి సాయం రూ.లక్షకు దరఖాస్తు చేసుకునేందుకు 15 కులాల వారికి అవకాశం ప్రభుత్వం కల్పించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు నిర్వహించిన అనంతరం జిల్లాస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తాం. నిధుల కేటాయింపు అనేది నిరంతర ప్రక్రియ. ప్రజలు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు. – ఉపేందర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి

వారం రోజుల్లో ఉపాధ్యాయులు

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను వారం రోజుల్లో తీరుస్తానని డీఈఓ రేణుకాదేవి చెప్పారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం ఎంపీహెచ్‌ఎస్ పాఠశాలలో కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉపాధ్యాయుల కొరతపై శనివారం 'ఉన్నత పాఠశాల.. ఉన్నది ఒక్కరే' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి డీఈఓ స్పందించారు. త్వరలో ఎంఈఓలతో సమీక్ష నిర్వహించి డిప్యుటేషన్, తదితర మార్గాల ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను పూరించి, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేస్తానని చెప్పారు.

పార్టీని బలోపేతం చేసేందుకే కమిటీలు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకే అనుబంధ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్' కార్యక్రమాన్ని వికారాబాద్ నియోజకవర్గం ఎల్‌డీఎం కోఆర్డినేటర్ రఘుపతిరెడ్డితో కలిసి.. కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షలో రవీందర్ మాట్లాడారు. గ్రామాల్లో అనుబంధ శాఖల కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకొని, పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఈ నెల 20 వరకు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ, మహిళా సంఘాలతో పాటు రైతుసంఘం కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు ఆయా శాఖల పార్టీ మండల అధ్యక్షులు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్యగౌడ్, మర్పల్లి మాజీ ఎంపీపీ నర్సింహులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ, ఉపాధ్యక్షుడు సలీం పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి 'సహకారం'



చెరువుముందలి తండాలో నూతన జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నేతలు

- వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు
- డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల, గోప్యానాయక్ తండాల్లో రైతులకు గడియారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగానికే కాంకుడా.. అనుబంధ రంగాలకు సైతం రుణసౌకర్యాన్ని కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. నాలుగేళ్ల క్రితం నష్టాల్లో ఉన్న సంఘాలను నేడు లాభాల్లోకి తీసుకురావడమే కాకుండా.. వచ్చిన లాభాల ప్రతిఫలాలు రైతులకు అందేలా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రైతు కుటుంబీకుల అవసరాల నిమిత్తం వారి పిల్లల విదేశీ చదువులకు రూ.25 లక్షల వరకు రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, వివాహ శుభకార్యాలకు తక్కువ అద్దెతో మినీ ఫంక్షన్‌హాల్‌ను సైతం అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. అనంతరం చెరువుముందలి తండా(ఎ), గోగ్యనాయక్ తండాల్లో గిరిజన దినోత్సవం సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, చౌడాపూర్ మండల ప్రత్యేక అధికారి ఉపేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పీఏసీఎస్‌సీఈఓ బక్కారెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచులు శిరీష, ఎంపీటీసీ జ్యోతి, రాజు, పద్మ, రవి, పంచాయతీరాజ్ డీఈ, ఏఈ మణికుమార్, నాయకులు రాజప్ప, వెంకటయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా గిరిజనోత్సవాలు



మర్పల్లి: నర్సాపూర్ గ్రామపంచాయతీ వద్ద తండా వాసులు

- ఆటపాటలతో అలరించిన గిరిజనులు
- ముఖ్యమంత్రితోనే తండాలకు గుర్తింపు
- అభివృద్ధిలో రాణిస్తున్న గ్రామాలు: వక్తలు

మర్పల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన తండాల్లో గిరిజనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తండాల్లో గిరిజనులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీడీఓ రాజ మల్లయ్య మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. గిరిజనులకు పాలన వ్యవస్థ అందుబాటులో ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం 300 జనాభా కలిగిన ప్రతి గిరిజన తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం తండాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేశ్, సర్పంచ్ ధరమ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి అర్చన, గ్రామ ప్రత్యేక అధికారి మల్లయ్య, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం పోచయ్య, సీసీ శ్రీనివాస్, పాలకవర్గం, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుల్కచర్ల మండలం గిరిజన గ్రామపంచాయతీల్లో గిరిజనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అల్లాపూర్ సర్పంచ్ సివిబాయి మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా గిరిజనులు మరింత అభివృద్ధి చెందుతారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మైమూనబేగం, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



అల్లాపూర్‌లో సేవాలాల్ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: సీఎం కేసీఆర్ వలనే తండాలు గ్రామ పంచాయతీలుగా స్వయం పాలన చేసుకునే వీలు కలిగిందని, గిరిజన సమాజం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి రుణపడి ఉండాలని ఎంపీపీ కరుణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తండాల్లో గిరిజనోత్సవం ఘనంగా నిర్వహించారు. మంతన్‌గౌడ్‌తండాలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని గిరిజనుల సాంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు.

బంట్వారంలో..

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి నాగవరం తండాలో గిరిజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సర్పంచ్ లక్ష్మి మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ షాహెదబేగం



దోమ: మోత్కుర్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ షాహెదబేగం

దోమ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ షాహెదబేగం తెలిపారు. శనివారం దోమ మండలం దోమ, ఐనాపూర్, పాలేపల్లి, మోత్కుర్ పోలింగ్ బూత్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులకు అన్ని వసతులను కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. విద్యుత్ సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటరు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు చేర్పులకు అవకాశం

కుల్కచర్ల: ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేవారు చేసుకోవాలని సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిలు చెప్పారు. మండల కేంద్రంలో ఓటర్‌లిస్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్వోలు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లెబాట

- గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



కడుమూరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: సమస్యల పరిష్కారానికే పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం కుల్కచర్ల మండలం అంగడిచిట్టంపల్లి, చన్గోముల్, రేగడమామిడిపల్లి, మిట్టకంకల్, కడుమూరు, కుత్బుల్లాపూర్, మేడిపల్లికలాన్ గ్రామాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామానికి బీటీరోడ్లు వేశామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఆర్‌ఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి



జీపీ భవనం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందాయని, రాష్ట్రంలో 30 ఏళ్లలో జరగని అభివృద్ధి.. కేవలం తొమ్మిదేళ్ల కాలంలోనే జరిగిందని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి చెప్పారు. శనివారం పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో రూ.20 లక్షలతో మంజూరైన గ్రామ పంచాయతీ నూతన భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీకి రూ.47లక్షల నుంచి రూ.50లక్షల వరకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, పాండునాయక్, శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రమేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవినాయక్, ఎంపీడీఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే హరితోత్సవం వాల్ పోస్టర్‌ను అటవీశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ రామ్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

• 19న హరితోత్సవం

వికారాబాద్ అర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న హరితోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం కౌన్సిల్ హాలులో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. హరితహారం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఎన్ని మొక్కలు నాటాము, ఎంత మేరా ఫలితం సాధించామనే విషయాన్ని వివరించేందుకు ఆ విభాగం అధికారులు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

• 20న విద్యా దినోత్సవం

పెద్దేముల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించనున్న విద్యా దినోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి వెంకటయ్య కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యా దినోత్సవంలో భాగంగా ప్రతి బడిలో జాతీయ జెండా ఎగురవేయాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పాల్గొనేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు అక్కమదేవి, మల్లమ్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఈ నెల 20వ తేదీన విద్యా దినోత్సవం నిర్వహించాలని ఎమ్ఈఓ రాంరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి పాఠశాలలో మంగళవారం ఉదయం 7.30 గంటలకు విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించాలన్నారు. గ్రామస్తులను పిలిచి గౌరవించాలన్నారు.

• పోలింగ్ స్టేషన్ల పరిశీలన

బషీరాబాద్: ఎన్నికల కార్యక్రమంలో భాగంగా బషీరాబాద్ తహసీల్దార్ వెంకట్ స్వామి శనివారం మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కనీస వసతులు, ఏర్పాట్లపై ఆరాతీశారు.

• ఆర్థికసాయం

దోమ: బొంపల్లి గ్రామంలో డీవీటి నర్సింహులు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి.. శనివారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం తన వర్గీయులతో అందజేశారు.

• నేడు మంచి నీళ్ల పండుగ

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే మంచి నీళ్ల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. మిషన్ భగీరథ, ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల సందర్శన ఉంటుందన్నారు. నీళ్లను శుభ్రపర్చే తీరు, ఇంటింటికీ నల్లాల ద్వారా నీటి సరఫరాపై ప్రజలకు వివరించాల్సి ఉంటుందన్నారు.


• అధికారులపై చర్యలు తీసుకోవాలి

బంట్వారం: నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోమిన్‌పేట మండలం గోవిందాపూర్‌లో ఇటీవల ఓ ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ, జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్‌కు సమాచారం ఇవ్వక పోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇలాంటి అధికారులపై చర్యల నిమిత్తం సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

• బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మృతి

తాండూరు రూరల్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన తింసన్‌పల్లి అంజిలప్ప(65) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. 15 రోజుల క్రితం అంజిలప్పకు పక్షవాతం రావడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇంటి వద్దే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

• పానాదిని విడిపించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెద్దేముల్: ఆక్రమణకు గురైన పానాది దారిని విడిపించాలని చైతన్యనగర్ గ్రామం చెంచు రైతులు శనివారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ శివారులో గల పానాది.. పొలాలకు వెళ్లడానికి అనువుగా ఉండేదని, ఆ పానాదిని ఓ రైతు ఆక్రమించి, సాగు చేశాడని, దీంతో పొలాలకు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురైన దారిని విడిపించి న్యాయం చేయాలని కోరారు.